క్లుప్తంగా

బీసీ గురుకుల పాఠశాల ఎక్కడ?

సైదాపూర్: మండలానికి మంజూరైన బీసీ గురుకుల పాఠశాల వసతి సౌకర్యం లేక హుజూరాబాద్ తరలిపోయి ఏండ్లు గడుస్తున్నా, పాలకులు అధికారులు పట్టించుకోవడంలేదని డీసీసీ అధికార ప్రతినిధి మ్యాకలరవీందర్ ఆరోపించారు. బుధవారం ఆయన మండలకేంద్రంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా మండలానికో గురుకులం మంజూరుచేసిన బీసీ గురుకుల పాఠశాల కొంతకాలం ఎస్టీ హాస్టల్‌లో నిర్వహించారని వసతి సరిపోవడం లేదని హుజూరాబాద్ తరలించారన్నారు. అక్కడ కూడా అద్దెభవనంలో అరకొర వసతులతో కొనసాగుతోందని రవీందర్ మండిపడ్డారు. మండలానికి మంజూరైన పాఠశాలకు స్థల సేకరణ చేసి, భవనం నిర్మించి, మండల విద్యార్థులకు ప్రభుత్వ విద్యను అందించాల్సిన అధికారులు పాలకులు బీసీ గురుకులంపై పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్థలసేకరణ చేసి పాఠశాల భవనం నిర్మించాలని, గురుకుల పాఠశాలను మండలకేంద్రంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

జమ్మికుంట: పెండింగ్‌లో స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాణాప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పట్టణంలోని గాంధీచౌరస్తా నుంచి బస్టాండ్ వరకు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్‌ను రాష్ట్రప్రభుత్వం అంధకారంలోకి నెట్టిందన్నారు. మూడేళ్లుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.5,135 కోట్లు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలుచేస్తామని హామీఇచ్చి ఇంతవరకు నెరవేర్చలేదన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, అజయ్, సంతోష్, అంజీ, కార్తీక్ తదితరులు ఉన్నారు.

గణిత ప్రజ్ఞ పోటీలు

వీణవంక: మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో పెండ్యాల కిరణ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 6 నుంచి పదోతరగతి విద్యార్థులకు గణిత ప్రజ్ఞ పోటీలు నిర్వహించారు. అనంతరం బహుమతులు అందించారు. ట్రస్టు నిర్వాహకుడు విజయరెడ్డి మాట్లాడుతూ.. తన కుమారుడి జ్ఞాపకార్థం విద్యార్థులకు తమవంతుగా సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. పెండ్యాల నారాయణ రెడ్డి, కిషోర్‌రెడ్డి, ఝాన్సీరెడ్డి, హెచ్‌ఎం అశోక్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటిపొదుపుపై..

వీణవంక: మండలంలోని చల్లూరు జెడ్పీపాఠశాలలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో జలసంరక్షణ వర్షం నీటిపొదుపుపై విద్యార్థులకు అవగాహనతో పాటు క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. యూత్ అధ్యక్షుడు కర్రె నాని, వలంటీర్ దూలం సురేశ్, హెచ్‌ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు విద్యాసాగర్, గంగారాం, శ్రీలతదేవి, శైలజ, శ్యాం, వనజ, ప్రభావతి ఉన్నారు.

మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా లావణ్య



ఉత్తర్వులు అందిస్తున్న బల్మూరి వెంకట్

హుజూరాబాద్: కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా లంకదాసరి లావణ్యను నియమిస్తూ బుధవారం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ బల్మూరి వెంకట్ నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ.. మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

'మానేరు'లో ఫ్రూట్స్ అండ్ వెజిటేబుల్స్ డే

సప్తగిరికాలనీ: నగరంలోని మానేరు విద్యాసంస్థల్లో బుధవారం ఫ్రూట్స్ అండ్ వెజిటేబుల్ డే నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల కూరగాయలు, పండ్ల వేషధారణలో హాజరై ఆకట్టుకున్నారు. కూరగాయల, పండ్లను ప్రదర్శించారు. మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ విద్యార్థులకు బాల్య దశ నుంచే అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మానేరు విద్యాసంస్థల అధినేత కడారి సునీతారెడ్డితో పాటు ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సి పాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ముచ్చటగా మూడోసారి..

- జాతీయ అవార్డుకు పోటీపడుతున్న 'వెలిచాల' గ్రామపంచాయతీ
- జిల్లాస్థాయి అధికారుల పర్యవేక్షణలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు
- ఇంటింటా సర్వే పనులు
- రాష్ట్రస్థాయి అధికారుల పర్యటనలు
- అవార్డు కోసం కష్టపడుతున్న పంచాయతీ పాలక వర్గం



వెలిచాలలోని గ్రామపంచాయతీ కార్యాలయం

రామడుగు: పట్టణస్థాయిలో అభివృద్ధిలో ముందుకువెళ్తున్న వెలిచాలగ్రామం మండల, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో ఎన్నో అవార్డులు సొంతం చేసుకుంది రెండుపర్యాయాలు జాతీయస్థాయి అవార్డులు సొంతంచేసుకుని ముచ్చటగా మూడోసారి 'స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 ' జాతీయ అవార్డు సాధించే దిశగా ముందుకు సాగుతోంది.

5వేల జనాభా కేటగిరీలో...

జాతీయస్థాయిలో కేంద్రప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 అవార్డుల ఎంపిక 5వేల జనాభా కేటాగిరీలో ప్రక్రియను ప్రారంభించడంతో రామడుగు మండలంలోని వెలిచాల గ్రామంపై అధికారులు దృష్టిసారించి అవార్డుసాధనకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి గ్రామంలో కార్యాచరణ నిర్వహిస్తున్నారు.

నిత్యం పనులు..

గ్రామంలో నిత్యం జీపీ పాలకవర్గంతో పాటుగా సిబ్బంది అవార్డు పొందడమే లక్ష్యంగా గ్రామంలో పనులు చేపడుతున్నారు. ఉన్నతాధికారులు సూచనలతో ప్రధానంగా గ్రామంలో పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ తీరు, ఇంకుడుగుంతలు, తడి, పొడి చెత్తబుట్టల వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను షెడ్డు వద్దకు తరలించి పొడిచెత్తతో ఆదాయం, తడి చెత్తతో సేంద్రియ ఎరువులు తయారీచేసే ప్రక్రియను విజయవంతంగా కొనసాగిస్తున్నారు.

మహిళా సంఘాలతో...

వెలిచాల గ్రామంలోని మహిళా సంఘాలతో జిల్లా డీఆర్‌డీవో పీడీ లెంకల శ్రీలతారెడ్డి, డీపీవో వీరబుచ్చయ్య, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి నిత్యం గ్రామంలో పర్యటిస్తూ, ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఓడీఎఫ్ ప్లస్ అంశాలపై శిక్షణ అందిస్తున్నారు. దీంతో గ్రామంలో స్వశక్తి సంఘాలు బలోపేతం వైపు ముందుకు వెళ్తున్నారు.



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ప్రత్యేక బృందం

హరితహారం ...

గ్రామంలో హరితహారంలో భాగంగా గ్రామపంచాయతీ ప్రత్యేకంగా శ్రద్ధవహించి మొక్కలను విరివిగా పెంచడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటోంది. అంతేకాకుండ గ్రామంలో ఇంటింటా మొక్కల పంపిణీ కార్యక్రమం ప్రత్యేకంగా చేపట్టింది. దీంతో గ్రామంలో హరితహారం కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది.

అందరం కష్టపడుతున్నాం



జాతీయ స్థాయిలో అవార్డు సాధించేందుకు మా పంచాయతీ పాలకవర్గంతో పాటు జిల్లా, మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది కష్టపడి పనిచేస్తున్నాం. గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 నామ్స్ ప్రకారం పనులు చేపడుతున్నాం. దీనికి గ్రామస్తులు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారు.

– వీర్ల సరోజన, సర్పంచ్, వెలిచాల

మళ్లీ అవార్డు రావాలి



మా గ్రామానికి గతంలో ఎన్నో మండల, జిల్లా, రాష్ట్రస్థాయి అవార్డులు వచ్చాయి. ఇప్పటికి రెండుసార్లు జాతీయస్థాయి అవార్డులు సొంతం చేసుకుంది. ఇప్పుడు మళ్లీ జాతీయస్థాయిలో గుర్తింపుపొంది అవార్డు సాధించాలని కోరుకుంటున్నా.. గ్రామంలో అందరు కష్టపడి గ్రామాభివృద్ధికి కృషిచేస్తున్నారు.

– ఉప్పుల శ్రీనివాస్, గ్రామస్తుడు, వెలిచాల

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి

- నిరసన తెలిపిన బీజేపీ నాయకులు
- డబుల్‌బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, దళిత, బీసీబంధు, పింఛన్ల కోసం ఆందోళన
- నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు



చొప్పదండి: ర్యాలీగా వెళ్తున్న బీజేపీ కార్యకర్తలు

చొప్పదండి: గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలుచేయాలని కోరుతూ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని బుధవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన రోడ్డుపై నుంచి ర్యాలీగా వెళ్తుండగా బీజేపీ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈక్రమంలో తోపులాట జరిగింది. పోలీసులు వారిని అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో పెరుక శ్రావణ్, మేకల ప్రభాకర్‌యాదవ్, బత్తుల లక్ష్మీనారాయణ, సింగిరెడ్డి కృష్ణారెడ్డి, జాడి బాల్‌రెడ్డి, చేపూరి సత్యనారాయణ, వైద రామానుజం, సుదర్శన్‌రెడ్డి, బత్తిని సంపత్, పాల్గొన్నారు.

రసమయి కార్యాలయం ముట్టడి

తిమ్మాపూర్: బీజేపీ పిలుపుతో మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలో మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఇంటిని బీజేపీ నాయకులు బుధవారం ముట్టడించారు. ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని ఆందోళన చేశారు. గత ఎన్నికల హామీలు, అర్హులైన వారికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాకే ఎమ్మెల్యే రసమయి నియోజకవర్గంలో తిరగాలన్నారు. కేసీఆర్ ఎన్నికల హామీలను, ప్రకటించిన సంక్షేమ పథకాలను అమలుచేయడంలో విఫలమయ్యారన్నారు. మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతున్న కేసీఆర్ సర్కార్‌ని రాబోయే ఎన్నికల్లో నిలువరించాలని బీజేపీ నేతలు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు వైపు వెళ్లిన బీజేపీ నేతలు కార్యకర్తలను పోలీసులు అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముందస్తు సమాచారం అందుకున్న పోలీసులు తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి, మానకొండూర్ సీఐ రాజకుమార్, ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి, గన్నేరువరం ఎస్సై నర్సింహారావుతో పాటు సుమారు 30 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రాష్ట్ర నాయకులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, గడ్డం నాగరాజు, సొల్లు అజయ్‌వర్మ, జిల్లా ఉపాధ్యక్షుడు మాడ వెంకట్‌రెడ్డి, అధికార ప్రతి నిధులు అలివేలి సమ్మిరెడ్డి, బొంతల కల్యాణ్ చంద్ర ఎంపీటీసీ అంతం రాజిరెడ్డి, తిమ్మాపూర్, గన్నేరువరం, శంకరపట్నం సుగుర్తి జగదీశ్వరాచారి, నగునూరి శంకర్, ఏనుగుల అనిల్, ఆయా మండలాలకు చెందిన సుమారు 100 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు ముట్టడిలో పాల్గొన్నారు.



డీసీఎంలో స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

రాష్ట్రాభివృద్ధికి అవకాశం ఇవ్వండి

హుజూరాబాద్: కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెట్టాలంటే బీజేపీకి ప్రజలు అవకాశం ఇవ్వాలని అసోం రాష్ట్ర సోనారి నియోజకవర్గ ఎమ్మెల్యే ధర్మేశ్వర్ కోన్వర్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే ప్రవాస్‌యోజన కార్యక్రమంలో భాగంగా స్థానిక బీజేపీ శ్రేణులతో విద్యానగర్ శిశుమందిర్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీజేపీపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్లుగా అవినీతిరహిత పాలన అందిస్తోందన్నారు. మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు నేడు దేశ దశ దిశలను మార్చాయన్నారు. ముఖ్యంగా 370 ఆర్టికల్, త్రిబుల్ తలాక్, అయోధ్య రామ మందిరం, వన్‌నేషన్ వన్‌రేషన్, డిజిటల్ ఇండియా, విదేశాంగ విధానం, సీఏ ఏ, యు సీసీ, మేకిన్ ఇండియా, నేషనల్ హైవేస్ , ఆత్మ నిర్బర్ భారత్, స్వచ్ఛభారత్, 220 ఉచిత కరోనా వ్యాక్సిన్, 80 కోట్ల మందికి మూడేళ్లుగా ఉచితరేషన్ నూతన విద్యావిధానం , ఆయుష్మాన్ భారత్ వంటి అనేక సంక్షేమ పథకాలు దేశానికి ఎంతోమేలు చేశాయన్నారు. దేశంలోని అన్ని రంగాలను బలోపేతం చేయడానికి మోదీ ప్రభుత్వం విశేష కృషి చేసిందన్నారు. కేంద్రంలో మాదిరిగానే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే డబుల్ ఇంజన్‌సర్కారుతో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి నాయకులు, కార్యకర్తలు పార్టీ విజయానికి కృషిచేయాలన్నారు. సమావేశంలో బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, ప్రవాస్ యోజన కోఆర్డినేటర్ పుప్పల రఘు, బీజేపీ అధికార ప్రతినిధులు జెల్ల సుధాకర్, మాసాడి ముత్యంరావు, మహిళామోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు కళ్లెపు రేణుక, స్వల్పకాలిక్ విస్తారక్ సుధీర్, సీనియర్ నాయకులు కళ్లెపు సుధాకర్‌రావు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మేశ్వర్ కోన్వర్

కాంగ్రెస్ టికెట్‌కు రాజమల్లయ్య దరఖాస్తు



రామడుగు: చొప్పదండి అసెంబ్లీస్థానానికి కాంగ్రెస్ నుంచి పోటీచేయడానికి రామడుగు మండలంలోని వెదిర గ్రామానికి చెందిన టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్రకన్వీనర్ వెన్న రాజమల్లయ్య బుధవారం గాంధీభవన్‌కు వెళ్లి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. తనకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయడానికి అవకాశం కల్పించాలని పార్టీ ముఖ్యనేతలను కలిసి కోరినట్లు తెలిపారు.

నేడు మండల సభ

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జయశ్రీ బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

27న వ్యాసరచన పోటీలు

విద్యానగర్(కరీంనగర్): శ్రీకృష్ణాష్టమి సందర్భంగా కరీంనగర్‌లోని సాయినగర్‌లోని శ్రీమురళీకృష్ణ ఆలయంలో ఈనెల 27న ప్రైమరీ విద్యార్థులకు శ్రీకృష్ణుడి బాల్యలీలలు అంశంపై, హైస్కూల్ విద్యార్థులకు శ్రీకృష్ణ రాయబారం అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్ల కృష్ణ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వివరాలకు 98495 05589, 70137 42747 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రతిభా పురస్కారాలు

విద్యానగర్(కరీంనగర్): జిల్లాలోని పద్మశాలీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు పద్మశాలీ అఫిషియల్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలు సత్యనారాయణ తెలిపారు. పదోతరగతి నుంచి ఉన్నత విద్యాకోర్సులు చేసిన విద్యార్థులు జిరాక్స్‌లతో సెప్టెంబర్ 5లోగా కరీంనగర్‌లోని వినాయక మార్కెట్‌లోని పోపా కార్యాలయంలో అందించాలని కోరారు. వివరాలకు 98481 13295 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వికలాంగులకు అండగా బీఆర్‌ఎస్



పింఛన్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: రాష్ట్రంలో వికలాంగులకు రూ.4016 పింఛన్ అందిస్తూ వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని మధురానగర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాలులో బుధవారం దివ్యాంగులకు రాష్ట్రప్రభుత్వం పెంచిన పింఛన్ పత్రాలను ఎమ్మెల్యే అందించారు. దివ్యాంగులకు అవసరమైన అన్ని పరికరాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

మిత్రుడి జ్ఞాపకార్థం ఆర్థికసాయం

- 'సాక్షి' కథనానికి స్పందన
- హమ్ స్వచ్ఛంద సంస్థ ఉదారత



ఆర్థికసాయం చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

చొప్పదండి: చిన్ననాటి మిత్రుడి పెద్దకర్మ రోజు అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థికసాయం అందించి తమ ఉదారత చాటుకున్నారులు తోటిమిత్రులు. చొప్పదండి పట్టణానికి చెందిన పొన్నం శ్రీనివాస్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కథనం ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైంది. ఇదే సమయంలో కరీంనగర్‌కు చెందిన హమ్ స్వచ్ఛంద సంస్థసభ్యులు తమచిన్ననాటి మిత్రుడు శివప్రతాప్ ఇటీవల మృతిచెందడంతో ఆయన జ్ఞాపకార్థం బుధవారం చిన్నకర్మ నిర్వహిస్తుండగా అనారోగ్యంతో బాధపడుతున్న పొన్నం శ్రీనివాస్ వద్దకు వెళ్లి రూ. 12వేలు ఆర్థికసాయం అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి అనారోగ్యానికి గురికావడంతో పాటు, అద్దెఇంట్లో ఉండడం తమను కలచివేసిందని తెలిపారు. కార్యక్రమంలో హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్, శ్రీనివాస్ ముందడ,మనోజ్ ముందడ, రవికుమార్, రాఘవేందర్, ప్రశాంతి, పావనిరెడ్డి, లక్ష్మణ్‌బాబు, జస్పాల్ సింగ్, గోవర్ధన్, శ్రీనివాస్, రతన్‌కుమార్, గౌడ సంఘం అధ్యక్షుడు గంగయ్య పాల్గొన్నారు.

'యుద్ధభేరి' సభ జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యాదవ సంఘం సభ్యులు

హుజూరాబాద్: హైదరాబాద్ మహానగరంలో ఈ నెల 25న నిర్వహించే యాదవ యుద్ధభేరి సభను యాదవులంతా కలిసికట్టుగా విజయవంతం చేయాలని రాష్ట్ర యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్రకార్యదర్శి పాక కుమారస్వామి కోరారు. బుధవారం పట్టణంలో యాదవ సభ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. యాదవులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి ఉద్యమించాలని క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న యాదవ సంఘాలన్నీ ఐకమత్యం కావాలని పిలుపునిచ్చారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను రద్దుచేయాలని, యాదవులకు యాదవ ఉప కులాలకు రిజర్వేషన్స్ కల్పించాలన్నారు. సమావేశంలో యాదవసంఘం బాధ్యులు కన్నబోయిన శ్రీనివాస్ యాదవ్, బత్తుల రాజకుమార్ యాదవ్, గిరివేని శ్రీనివాస్ యాదవ్, పోతర బోయిన రాజయ్యయాదవ్, దాసరి కోటి యాదవ్, మేకల కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

పద్మశాలీ శంఖారావం పోస్టర్ ఆవిష్కరణ



గంగాధర: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలో బుధవారం చలో హైదరాబాద్ పద్మశాలీ శంఖారావం పోస్టర్‌ను మండల పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. వచ్చేనెల 3న నిర్వహించే పద్మశాలీ శంఖారావానికి కుల సంఘాల సభ్యులు తరలిరావాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు మెతుకు సత్యం, వల్లాల కృష్ణహరి, బత్తిని సత్యనారాయణ, చిందం రాజమౌళి పాల్గొన్నారు.

గన్నేరువరం: సెప్టెంబర్ 3న హైదరాబాద్‌లో నిర్వహించే పద్మశాలీ శంఖారావం పోస్టర్‌ను బుధవారం మండలకేంద్రం గన్నేరువరంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, గౌరవ అధ్యక్షుడు వాసాలరమేశ్ ఆవిష్కరించారు ఈసభకు సంఘం సభ్యులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ప్రధానకార్యదర్శి ఓల్లాల కృష్ణహరి, కార్యనిర్వహక కార్యదర్శి ఓడ్నాల రవీందర్, మండల అధ్యక్షుడు గుంటుక లింగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బూర తిరుపతి, ప్రధానకార్యదర్శి బూర శ్రీనివాస్, ప్రచారకార్యదర్శి గాజుల లక్ష్మణ్, ఓడ్నాల తిరుపతి, వంగ సంపత్, బొల్లి రవి, మురారి, రాజేశం, ప్రభాకర్, వెంకటేశం పాల్గొన్నారు.

స్వచ్ఛసర్వేక్షణ్ బృందం పర్యటన



ఇంటింటా వసతులు తెలుసుకుంటున్న సభ్యులు

గన్నేరువరం: స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ్ 2023లో జాతీయస్థాయిలో పోటీల్లో నిలిచిన ఖాసీంపేట గ్రామాన్ని బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సభ్యులు సందర్శించారు. జాతీయస్థాయిలో 2వేల జనాభా గల గ్రామ పంచాయతీల కేటగిరీలో జిల్లానుంచి ఈ గ్రామం నిలిచింది. ఇందులో భాగంగా కేంద్రబృందం నుంచి ఇఫ్‌పస్ సంస్థ సభ్యుడు కిశోర్ ఆధ్వర్యంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల సౌకర్యం, వినియోగం, అంగన్‌వాడీ, ఆరోగ్యఉపకేంద్రం, వారసంత, ఆలయాల్లో పారిశుధ్యం పనులను పరిశీలించి ఆన్‌లైన్ నమోదు చేసుకున్నారు. గ్రామంలో వివిధ కాలనీల్లోని గృహాలను పరిశీలించారు. మరుగుదొడ్ల వినియోగం, తడిపొడి చెత్తసేకరణ, ఇంకుడుగుంతల వినియోగం, పరిసరాల పరిశుభ్రతను పర్యవేక్షించారు. అనంతరం కంపోస్ట్ షెడ్డులో పొడి చెత్తను ఆదాయం, తడి చెత్త నుంచి ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, ఎంపీవో నర్సింహారెడ్డి, సర్పంచ్ గంప మల్లీశ్వరీ, ఉపసర్పంచ్ బద్దం సంపత్‌రెడ్డి, యూనిసెఫ్ సమన్వయ కర్త కిషన్‌స్వామి, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, ఎస్‌బీఎం సమన్వయ కర్తలు రమేశ్, వేణు, పంచాయతీ కార్యదర్శులు ఆనంద్, అజయ్. ఫెసిలిటేటర్ రవీందర్, సీవో శేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి ప్లేట్లు అందజేత

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట శ్రీ మానసాదేవి ఆలయానికి కరీంనగర్‌కు చెందిన స్వరాజ్ ట్రాక్టర్ షోరూం మేనేజర్ శంకర్ కుటుంబసభ్యులతో కలిసి 200 స్టీల్‌ప్లేట్లు అందించారు. ఆలయంలో భక్తులకు నాలుగు రోజులుగా నిత్యాన్నదానం చేపడుతున్నారు. ఈ సందర్భంగా ప్లేట్లను ఆలయానికి అందించినట్లు ఆలయ గౌరవ అధ్యక్షుడు బద్దం నర్సింహారెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు నాగసాయిశర్మ తెలిపారు.



చైర్మన్ చంద్రారెడ్డికి ప్లేట్లు అందిస్తున్న శంకర్

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ..

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి జెడ్పీ పాఠశాలలో గంగిశెట్టి మధురమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీచేశారు. నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ మాట్లాడుతూ.. నిరుపేదలైన విద్యార్థులు ఎక్కువశాతం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారని, వారికి ట్రస్టు ద్వారా తమవంతు సహకారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు శ్యాం సుందర్‌రెడ్డి, సత్యనారాయణ, మల్లికార్జున్, శంకర్ సురేఖ, పద్మ, ప్రణీత, విద్యార్థులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నం. : 1800 425 9899